క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో రామలింగేశ్వరస్వామి

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తోట రామస్వామికి అభినందనల వెల్లువ


కిర్లంపూడిలో తోట రామస్వామికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన తోట రామస్వామిని సోమవారం కిర్లంపూడిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా లబ్ధి పొందారన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తించి పదవులు ఇస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అన్నారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ పెనగంటి రాజేష్, వేగి రామకృష్ణ, పాముల చంటి, కర్రి వెంకట రమణమూర్తి, పీలో సుబ్రహ్మణ్యం, అడారి గంగబాబు, శరకణం శ్రీను, దాడి అప్పలరాజు, పిట్టా లోవ తదితరులు పాల్గొన్నారు.

'తోట'ను కలసిన శివకుమార్


తోట నరసింహానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న శివకుమార్

గోకవరం: మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పాటి శివకుమార్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కిర్లంపూడి మండలం వీరవరంలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ యువ నాయకుడు తోట రాంజీ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

గోకవరం: వచ్చే నెల 3న జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పల్స్‌పోలియో కార్యక్రమంపై ఎంపీడీఓ కె.వసంత అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ మండలంలో అప్పుడే పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పోలియో కేసులు లేనప్పటికీ విధిగా చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, సొసైటీ అధ్యక్షుడు దాసరి చినబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, తోలేటి రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలతో పేదలకు మేలు

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లాశ్రీనివాస్ అన్నారు. మండలంలోని పరిమితడక గ్రామంలో సోమవారం బీజేపీ నాయకులు ప్రజాపోరుయాత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పార్టీ పతాకాన్ని కొల్లాశ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో సోమవారం 554 రైల్వేస్టేషన్లు, 1500 రైల్వే అండర్ పాస్‌లను ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ కురాకుల రాజా, యర్లగడ్డ వెంకట్రాయుడు, మోటుకూరి సంకురయ్య, అన్నవరం, సుబ్బారావు, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- డి.పోలవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


డి.పోలవరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: రాష్ట్రంలో గెలిచేది, మళ్లీ వచ్చేది జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పేర్కొన్నారు. మండలంలోని డి.పోలవరంలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ చింతల వెంకటరమణ, వైస్ ఎంపీపీ చిటికెల సత్యవతి ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో గ్రామస్తులకు రూ.44.45 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. పంచాయతీ పరిధిలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ ద్వారా రూ.38.19 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో విలక్షణమైన రాజకీయ నాయకులు ఉన్నారని, తప్పుడు ప్రచారాలు చేయడంలో సిద్ధహస్తులన్నారు. కుటుంబాలు, వ్యక్తుల మధ్య చిచ్చు పెట్టడం ఇక్కడ టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. 800 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు అదనపు గదులు కట్టేందుకు ఎన్నో అడ్డంకులు సృష్టించారన్నారు. అయినప్పటికీ సమస్యలన్నీ అధిగమించి పనులు చురుగ్గా చేయిస్తున్నామన్నారు. పింఛన్లు రూ.3 వేలకు పెంచిన ఘనత సీఎం జగన్‌కు దక్కిందని, పింఛన్లలో లంచాలు తీసుకున్న చరిత్ర టీడీపీ నాయకులదన్నారు. 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి గ్రామంలో పెద్ద మెజార్టీ వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో దానికి రెట్టింపు మెజార్టీ ఇవ్వాలన్నారు. చేనేత కార్మికులు కోరిక మేరకు రామాలయం నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.ఐదు లక్షలు తక్షణమే ఇస్తానని, మరో రూ.ఐదు లక్షలు తర్వాత ఇస్తానని హామీ ఇచ్చారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం నుంచి రూ.30 లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, జేసీఎస్ మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు చిటికెల వరహాలబాబు, తహసీల్దార్ భరత్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడికే పట్టం కడదాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- నీలాద్రిరావుపేటలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: ప్రజల కోసం నిరంతరం పాటు పడే ప్రజానాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే వచ్చే ఎన్నికల్లో పట్టం కడదామని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పిలుపునిచ్చారు. మండలంలోని నీలాద్రిరావుపేటలో సోమవారం ఆయన అనుచరులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకూ మేలు జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఒబిణ్ణి వీరబాబు, గ్రామ సర్పంచులు ములంపాక సురేష్, పోకల సుబ్బు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ రామకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తోట నరసింహం

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల చెంతకే వైద్యం


వేళంగిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని వేళంగి గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు డాక్టర్ సౌమ్యశ్రీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత నివారణకు ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుతం వర్షకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. 50 మంది సాధారణ రోగులు, 10 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 40 మంది మధుమేహ బాధితులు, 30 మంది రక్తపోటు బాధితులకు వైద్య సేవలు అందిచామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

నేడు మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: మండలంలోని కొలిమేరులో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటించనున్నట్టు మంత్రి కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఉదయం పది గంటలకు మంత్రి రాజా ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఎస్.అన్నవరం శివారు సాయివేదికలో జరిగే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

రైల్వే అండర్‌పాస్‌తో కష్టాలకు చెక్

- చేపూరులో ఆర్‌యూబీని వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ
- ఎంపీ వంగా గీత, మంత్రి రాజా కృషితో దశాబ్దాల కల సాకారం


పోటీల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

తుని రూరల్: రైల్వే అండర్‌పాస్ నిర్మాణంతో ప్రజల కష్టాలు తీరుతాయని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ పేర్కొన్నారు. మండలంలోని చేపూరులో నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌ను వర్చువల్‌గా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, స్థానికంగా రైల్వే అధికారులతో కలసి బొప్పన రాము, పోతల రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబాల క్రితం నిర్మించాల్సిన అండర్‌పాస్ బ్రిడ్జి ఎట్టకేలకు కాకినాడ ఎంపీ వంగా గీత, రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృషితో అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామస్తులు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ప్రధానమంత్రి మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. ప్రమాదాల నివారణే ప్రభుత్వ లక్ష్యమని రైల్వే నిర్వాహక అధికారి చక్రధర్ పేర్కొన్నారు. రైలే అండర్‌పాస్‌లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని, రక్షిత తాగునీటి పైపులు అమర్చేందుకు, అండర్ పాస్ సమీపంలో ఉన్న శ్మశానవాటికకు వెళ్లే రహదారి అభివృద్ధికి అనుమతి మంజూరు చేయాలని స్థానికులు రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ సదర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ కొండ్రు నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గొర్ల విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సుధారాణి, హాజరైన కౌన్సిలర్లు

తుని: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి సూచించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఛైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. అజెండాలో పొందుపరిచిన 64 అంశాలను సభ్యులు ఆమోదించారు. పట్టణాభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా కృతజ్ఞతలు తెలిపారు.

గరంగరంగా జీరో అవర్

పట్టణంలో నెలకొన్న సమస్యలపై జీరో అవర్‌లో కౌన్సిలర్లు గళం వినిపించారు. స్థానిక సూరవరం రోడ్డు పార్కు నుంచి సత్యసాయి మందిరం వరకూ శానిటేషన్ బాగోలేదని కౌన్సిలర్ కనిగిరి వెంకటరమణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ శేఖర్ స్పందిస్తూ మార్కెట్ యార్డు దగ్గర చిన్నచిన్న టిఫెన్ సెంటర్లు, మార్కెట్‌లో వచ్చే చెత్తను కాలువలో వేయడం వలన పారిశుధ్య సమస్య తలెత్తుతోందన్నారు. మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడి చెత్తసేకరణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. ఏఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని ఛైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. ఉప్పరగుడెంలో రిజర్వాయర్ నిర్మించాలని, ఇసుకలపేట వద్ద ఉన్న డంపింగ్ యార్డు తరలించాలని ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై డీఈఈ ప్రకాశరావు స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ జల జీవన్ మిషన్ పథకంలో కొత్తగా రిజర్వాయర్ నిర్మాణం, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు స్వర్గధామ ట్రస్ట్ 33 సెంట్ల భూమిని కొనుగోలు చేసిందని కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తెలిపారు. దాతల సహకారంతో మరుభూమిని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతానికి తరలిస్తామని కమిషనర్ వెంకట్రావు తెలిపారు. గణపతినగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పార్కుకు పొట్టి శ్రీరాములు పార్కుగా నామకరణం చేస్తూ చేసిన తీర్మాణానికి సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్‌కు రెండున్నరేళ్ల పదవీకాలం ముగియడంతో రాజీనామా చేశారు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో కొత్త వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందని ఛైర్‌పర్సన్ సుధారాణి తెలిపారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో జరిగిన అభివృద్ధిని ప్రజల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

వీరలంకపల్లిలో రోడ్డు ప్రమాదం


ప్రమాదానికి గురైన వాహనం

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామశివారున వంతెన సమీపం ఆదివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరంలోని కలాం కళాశాలకు చెందిన కారు 2 గంటల సమయంలో రాజమహేంద్రవరం నుంచి గోకవరం వైపు వస్తూ వంతెన సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి డైవర్షన్ బోర్డును ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో నలుగురు వ్యక్తులు ఉండగా వారు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని ఎస్సై కె.నాగరాజు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


దేవస్థానం ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బుద్దరాజు సత్యనారాయణరాజు ఎన్నికయ్యారు. దేవస్థానంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఉద్యోగుల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా బీఎస్ఎన్ రాజు, గౌరవాధ్యక్షులుగా డీవీఎస్ కృష్ణారావు, గంగాధరబట్ల గంగబాబు, పి.కృష్ణప్రసాద్, టి. వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా కంచిబట్ల రామ్‌కుమార్, అనకాపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.సత్యశ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా జగన్నాథం, ఎంఎల్ గణపతిరావు, కోశాధికారిగా పి.తలుపులయ్య మరో 12 మంది కార్యవర్గసభ్యులు, నలుగురు మహిళా ప్రతినిధులు ఎన్నికయ్యారు.

గెద్దనాపల్లిలో వలంటీర్లకు వందనం


గెద్దానాపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న నాయకులు

కిర్లంపూడి: మండలంలోని గెద్దనాపల్లి సచివాలయంలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మొల్లేటి గంగాభవాని ఆధ్వర్యంలో సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగలక్ష్మి, మొల్లేటి గంగాధర్, బిరిసి రాజేష్, దాడి త్రిమూర్తులు, బీశెట్టి శివాజీ, సెక్రటరీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాటంశెట్టి దీక్ష


పాటంశెట్టి సూర్యచంద్రను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: జగ్గంపేట ఎమ్మెల్యే టిక్కెట్ టీడీపీకి కేటాయించి, తనకు అన్యాయం చేయడంపై జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర మండలంలోని అచ్యుతాపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతోంది. దీక్షా శిబిరాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి పాటంశెట్టి సూర్యచంద్ర, శ్రీదేవి దంపతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన సూర్యచంద్రకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలను నమ్ముకున్న వారు మోసపోతారనడానికి పాటంశెట్టికి జరిగిన అన్యాయమే నిదర్శనమన్నారు. గత మూడు రోజులుగా దీక్ష చేస్తున్నా కనీసం ఆ పార్టీలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, సమ్మెటి నాని, సుంకర వెంకటరమణ, నరాలశెట్టి నర్సయ్య, అక్షింతల రాజా, తోలేటి రాంప్రసాద్, సర్పంచ్ బత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై విద్యార్థులకు అవగాహన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం

తొండంగి: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యం, ఎన్నికల ప్రక్రియపై పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు సోమవారం జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు. పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎన్నికల విధానం, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు, ప్రాథమిక హక్కులు తదతర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం వాకదారిపేట కేజీబీవీ విద్యార్థినులు ఓటు హక్కు వినియోగంపై నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్‌బాబ్జి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెహర్, హెచ్ఎం సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం


అల్లిపూడిలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు, అధికారులు

కోటనందూరు/కిర్లంపూడి ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని బాలికాభివృద్ధి అధికారి (జీసీడీఓ) కె. ఉమామహేశ్వరి అన్నారు. మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న విద్యార్థినులు విధిగా ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే కిర్లంపూడి మండలం సోమవరంలో గ్రామంలోనూ ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ చేశారు.

చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి


కోటనందూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న చేనేత కార్మికులు

కోటనందూరు: చేనేత సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని మండల చేనేత కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ విజయ్‌కుమార్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల సంఘాల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. చేనేత కార్మికులకు పింఛన్ల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన నిబంధనలు కాకుండా పాత విధానాన్నే అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులు పసగుడుగుల వరహాలు, దొడ్డి బాబ్జీ, పలకా సత్యనారాయణ, పసగడుగుల గోపీ పాల్గొన్నారు.

భవ్య పంచాయతన క్షేత్రానికి శంకుస్థాపన


పి.నాయకంపల్లి శంకుస్థాపన చేస్తున్న పండితులు

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో తత్వం చాటిటబుల్ ట్రస్ట్ నిర్మిస్తున్న భవ్య పంచాయతన క్షేత్రానికి సోమవారం శంకుస్థాపన చేశారు. కుమ్మరిలోవ పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి, తత్వం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పి.నాయకంపల్లిలో పంచాతయన క్షేత్రంతో పాటు పాటు గోశాల, వేద పాఠశాల, నిరుపేదలకు వైద్యం ఏర్పాటు చేస్తామని తత్వం ట్రస్ట్ చైర్మన్ బంగారయ్యశర్మ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గీతా మూర్తి, ప్రముఖ ప్రవచన కర్తలు డాక్టర్ అనంత లక్ష్మి, నిట్టల కిరణ్మయి, బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, మైలవరపు శ్రీనివాసరావు, సత్య ప్రభాకర్, చైత్ర, అలివేలు మంగ, వెలవలపల్లి దక్షిణామూర్తి శర్మ, రాధ మనోహర దాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలంటూ ధర్నా

కిర్లంపూడి: మండలంలోని రామచంద్రపురం దళితుల శ్మశాన వాటికలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు గ్రామంలోని దళితులు కిర్లంపూడిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్, ఇరిగేషన్ కార్యాలయాల వద్ద అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామరాడ నుంచి పెద్దాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఏలేరు కాలువ గట్టుపై దళితుల శ్మశానవాటికలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమ నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఆరోపించారు. దీనిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయాలన్నారు.